

# వైకుంఠయాత్ర

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

5

**ఎప్పటిలా** ఆ రాత్రి 'నింపి' నైట్ క్లబ్‌లో పాటలు పాడాడు శివాజీ. ఆ వారం కూడా అదే చేతి రాతతో 'ఆడుతు పాడుతు పని చేస్తుంటే' పాటకి రిక్వెస్ట్ వచ్చింది. అది అతను పాడుతున్నంతసేపూ శ్రద్ధగా విన్నదామె.

'జల్ తా హైతో దిల్ జల్ నే దే' శివాజీ పాడిన ఆఖరి పాట.

ఎప్పటిలా స్టాఫ్‌కి పెట్టే డిన్నర్ తీసుకోలేదు శివాజీ. బయటికొచ్చి ఆమె కోసం చూశాడు.

రోడ్డు క్రాస్ చేస్తూ కనబడింది. గబగబా నడిచి ఆమె దగ్గరికి వెళ్ళి పక్కనే నడవసాగాడు శివాజీ. అతనికి భయంగాను, ఎగ్జయిటింగ్‌గాను వుంది.

ఆమె తలతిప్పి చూడగానే చిన్నగా, పలకరింపుగా నవ్వాడు.

"మిమ్మల్ని నాకు పరిచయం చేసే మ్యూచువల్ ఫ్రెండ్ పేరు, అడ్రస్ చెప్పగలరా?" అడిగాడు.

"దేనికి నాతో పరిచయం?" అడిగింది. ఆసక్తిగానీ, కోపంగానీ ఆమె కంఠంలో లేదని గుర్తించాక ధైర్యం వచ్చింది శివాజీకి.

"డార్విన్ సిద్ధాంతం తప్పని మిమ్మల్ని చూసినప్పుడు అనిపించిందని చెప్పడానికి."

చిన్నగా నవ్విందామె.

"నా మాటలు నమ్మండి నేను లాయర్‌ని కాను."

ఈసారి ఫక్కున నవ్విందామె.

"నా మనసులో వున్న ఓ మాటని చెపితే మీకు కోపం రాదుగా?"

"అందువల్ల నాకు కోపం రావచ్చు అని మీకు అనిపించిందంటే, నాకు నిజంగా కోపం వస్తుందన్నమాటేగా?"

"అది పాజిటివ్ కాదుగా? రావచ్చు, లేదా రాకపోవచ్చు."

"అయితే ప్రయత్నించి చూడండి."

"నేను మీ బాత్రూమ్ టవల్ అయితే ఎంతో బాగుంటుంది. రోజూ మిమ్మల్ని తాకొచ్చు."

క్షణకాలం చురుగ్గా చూసిందామె. తరువాత ఇందాకటిలాగే ఫక్కున నవ్వింది.

"మీ పేరు చెప్తారా? నిన్న రాత్రి నా కలల్లోకి వచ్చిన అమ్మాయి పేరు తెలుసుకోవాలని వుంది."

"వెన్నెల"

"వెన్నెల అద్భుతంగా వుంది. మీలాగేమీ పేరు కూడా"

"థ్యాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్."

"మీరు తెలుగువాళ్ళా?" అంతదాకా హిందీలో సాగిన వాళ్ళ సంభాషణ తెలుగులోకి తీసుకొచ్చాడు శివాజీ.

"మాఅమ్మది ఖమ్మం జిల్లా, నాన్నది కృష్ణాజిల్లా. అవును తెలుగు వాళ్ళమే" తెలుగులో సమాధానం చెప్పింది వెన్నెల.

"మా అమ్మది గుంటూరు జిల్లా. కానీ నేను పుట్టి పెరిగింది బొంబాయిలోనే"

"నేనూ డిటోనే, మీ నాన్నది ఏ జిల్లా?"

ఆ ప్రశ్న వినగానే అతని  మొహం క్షణకాలం వాడిపోయింది.

"తెలియదు నాన్న చిన్నప్పుడే పోయారు."

"ఓ...సారీ."

"మీరేం చేస్తూంటారు? "

"బ్యూటీషియన్ కోర్స్ మొన్ననే పూర్తిచేశాను. దాదర్‌లోని ఓ బ్యూటీ పార్లర్‌లో అసిస్టెంటుగా పనిచేస్తున్నాను."

"మీరు ఎప్పుడైనా బ్యూటీ పార్లర్ పెడితే దానికేం పేరు పెట్టాలో నన్నడగండి."

"ఆ ఉద్దేశం వుంది నాకు. ఏ పేరు సజెస్ట్ చేస్తారు?"

"మూన్స్ బ్యూటీ పార్లర్."

"సౌండ్స్ గుడ్"

"వచ్చే శనివారం కూడా వస్తున్నారా?"

"ష్యూర్."

"మీకు 'ఆడుతు - పాడుతు పనిచేస్తుంటే' పాటంటే అంతిష్టమా?"

"కనిపెట్టేశారే అది నా రిక్వెస్ట్ అని"

"వెన్నెలలాంటి చేతిరాత తమకు కాక, ఇంకెవరికుంటుంది?"

"థ్యాంక్స్ ఎగైన ఫర్ ది కాంప్లిమెంట్. అదే మా ఇల్లు వస్తానండీ"

"మీ ఇంటి ఫోన్ నెంబరిస్తారా?"

"ఎయిట్ త్రి సెవెన్ ట్రిబుల్ ఫైవ్."

"రేపు మీ అమ్మగారికి ఫోను చేసి మిమ్మల్ని కన్నందుకు ధన్యవాదాలు చెప్తాను."

ఫక్కున నవ్విందామె.

"మీరు నూట అరవై నాలుగో వ్యక్తి అవుతారప్పుడు."

"అంటే సదభిప్రాయమేనన్నమాట నాది."

"నా యవ్వనపు తొలిదశలో మా అమ్మ నన్ను జాగ్రత్తగా వుండమని వార్న్ చేసిన అబ్బాయి మీరే."

"నేను చెడ్డవాడిని కాను."

"బహుశా అతి చెడ్డ మంచివారై వుంటారంతే."

ఇద్దరూ నవ్వుకున్నారు.

"డామ్ సీరియస్."

"నీ జీవితం, నీ ఛాయిస్."

"నువ్వా మాట అంటావని నాకు తెలుసు. అందుకే విషయమంతా చెప్పాను."

"ఓ అమ్మాయితో నువ్వింత చమత్కారంగా మాట్లాడగలవని నాకు తెలియదు."

"ఆ అమ్మాయితో మాట్లాడేదాకా నాకూ తెలియదు మమ్మీ."

ఉదయం చిట్‌ఫండ్ ఆఫీసుకి వెళ్ళాక అక్కడనుంచి వెన్నెలకి ఫోన్ చేశాడు అసలా సమయంలో ఇంట్లో వుంటుందో, వుండదో అనుకుంటూ.

ఓ ముసలాయన కంఠం వినిపించింది.

"హలో"

"వెన్నెలతో మాట్లాడాలండీ."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం తర్వాత వినిపించింది.

"లైన్‌లో వుండండి."

వెన్నెల కంఠం వినిపించింది. "హలో! కౌన్?"

"శివాజీని."

"హాయ్"

"హాయ్. థాంక్స్"

"దేనికి థాంక్స్?"

"తప్పు నంబరు ఇవ్వనందుకు. మీ బ్యూటీ పార్లర్‌కి ఫోన్ వుందా?"

"ఉంది కాని, అక్కడికి ఫోన్ చేయొద్దు."

"ఆల్‌రైట్. ఇంటికి ఏ టైమ్‌లో చేయొచ్చు?" అడిగాడు శివాజీ.

"ఉదయం ఈ టైములోగా. రాత్రి ఏడు తర్వాత ఈలోగా చేస్తే మమ్మీ వుంటుంది. మెసేజ్ తీసుకుంటుంది."

"మీ ఇంట్లో ఆ అండర్ స్టాండింగ్ వుందన్నమాట."

"ఉంది."

"అంటే ఎప్పుడైనా ఫోన్ చేస్తే మీకు ఇబ్బంది లేదుగా."

"లేదు, బై."

"బై బై."

వెన్నెల రిసీవర్ పెట్టేసింది అవతలివైపు.

"ఎవరది?" అడిగాడు వెన్నెల తండ్రి.

"క్లబ్‌లో పాటలు పాడతాడని చెప్పానే, అతను."

"శివాజీనా? ఏమిటట?"

"జస్ట్ కాజువల్ టాక్."

మళ్ళీ ఫోన్ మోగింది రిసీవర్ అందుకుని విని చెప్పాడాయన దాన్ని కూతురుకిచ్చి.

"మళ్ళీ అతనే."

"హలో" అంది రిసీవర్ అందుకుని.

"శివాజీని"

"చెప్పండి, ఏమిటి?"

"ఎప్పుడైనా ఫోన్ చేస్తూంటే మీకు ఇబ్బంది లేదన్నారుగా. అందుకని చేశాను."

గలగలా నవ్వింది వెన్నెల.

"ఏమిటి?" అడిగింది.

"ఒకటి నుంచి వందదాకా లెక్కపెట్టండి."

"దేనికి?" ఆశ్చర్యంగా అడిగింది.

"మీ కంఠం వినాలనుంది. అందుకుని లేదా ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ లేదా చబ్బి చీక్స్, డింపుల్ చిన్, లేదా జాక్ అండ్ జిల్ లాంటి ఎల్ కేజీ రైమ్స్ చెప్పండి."

"సమ్ అదర్ టైమ్. బ్యూటీ పార్లర్‌కి వేళయింది."

"రైట్. సమ్ అదర్ టైమ్."

ఫోన్ పెట్టేశాక అడిగాడు వెన్నెల తండ్రి.

"ఏమిటట?"

"నా వెంటపడుతున్నాడు డాడీ."

"స్టుపిడ్ క్యుపిడ్ జబ్బన్నమాట" నవ్వేశాడాయన.

వాళ్ళది మధ్య తరగతి కుటుంబమే అయినా మెట్రో పాలిస్‌లో ఉండటమువల్ల వాళ్ళది వెస్ట్రనైజ్డ్ కల్చర్.

ఓ కస్టమర్ ఫేషియల్ చేస్తూంటే వెన్నెలకి గుర్తొచ్చాడు శివాజీ. అతని మాటలు గుర్తొచ్చాయి.

"నేను మీ బాత్రూమ్ టవల్‌నైతే ఎంతో బాగుంటుంది. రోజూ మిమ్మల్ని తాకొచ్చు."

టవల్‌తో ఆ పేషెంటు మొహం తుడిచింది.

'అతనికి మాటలతో ఆకట్టుకునే శక్తి వుంది' అనుకుంది మనసులో. రాత్రి మళ్ళీ ఇంకొకసారి శివాజీ ఫోన్ చేస్తే బాగుండును అనుకుంది కూడా.

ఆ రాత్రి ఎనిమిదిన్నరకి భోజనం చేశాక బయటికి వచ్చి ఫోన్ చేశాడు శివాజీ వెన్నెల ఇంటికి.

వెన్నెల రిసీవర్ ఎత్తింది.

"ఏమిటి చెప్పండి?"

"ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చునని మీరు అనుమతి ఇచ్చారు కాబట్టి చేస్తున్నాను."

"కాబట్టి మీరే మాట్లాడండి. నేను వింటాను."

"మా ఇంట్లోని బెడ్‌షీట్ బాగాలేదు. ఓ మంచిది మీరే ఎన్నిక చేసుకుంటారా?"

"ఎందుకని?"

"ఎందుకంటే ఇప్పుడు నా మంచం మీద వున్న బెడ్ షీట్ మీ బ్లౌజ్‌కి మేచ్ అవదు కాబట్టి."

"వాడ్డాయూ మీన్?"

"ఐ మీన్ మన పెళ్ళయ్యాక మీ బ్లౌజ్‌కి నా బెడ్ షీట్ మేచ్ అవ్వాలన్నది నా కోరిక."

వెన్నెల కి ఎంతో సిగ్గేసింది. బుగ్గల్లో వెచ్చటి ఆవిరి ఆ మాటలు అర్ధంకాగానే.

"బత్తమీజ్" అప్రయత్నంగా అన్నది.

"థాంక్యూ తక్కువ తిట్టినందుకు."

"మా అమ్మా, నాన్నా భోజనానికి నాకోసం వెయిట్ చేస్తున్నారు. సమ్ అదర్ టైమ్, గుడ్‌నైట్."

రిసీవరు పెట్టేసింది వెన్నెల. ఆమెకి ఎంతో గర్వంగా వుంది. తన అందాన్ని పొగిడి, 'నన్ను పెళ్ళిచేసుకోవా' అని ఓ యువకుడు అడిగితే ఏ అమ్మాయికి గర్వంగా వుండదు?

"అమ్మా! నేను బొంబాయి వెళ్ళొస్తానే" తల్లితో చెప్పాడు పవన్ ఆ సాయంత్రం.

"దేనికి?" అడిగిందావిడ.

"పార్టీ ప్రెసిడెంట్ బొంబాయి వస్తున్నాడు. ఆయన్నక్కడ కలిసి టిక్కెట్ కోసం ప్రయత్నం చేయాలి. ఇంకెవరికైనా అది కమిట్ కాకుండానే అడగాలి."

"ఎన్ని రోజులుంటావు?"

"రేపు మార్నింగ్ వెళ్ళి పనవగానే సాయంత్రానికో, లేదా ఎల్లుండి పొద్దున్నకో తిరిగి వచ్చేస్తాను."

"అలాగే"

ఆది లక్ష్మమ్మకి నోటిదాకా వచ్చింది 'పావని ఇంటికి వెళ్ళొద్దు' అని చెప్దామని. తను చెప్పినా కొడుకు అతని మనసులో ఉన్నట్లుగానే చేస్తాడు కాబట్టి చెప్పలేదా మాట.

సహర్ ఎయిర్‌పోర్ట్ నుంచి సరాసరి పార్టీ గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నాడు టాక్సీలో. ఢిల్లీ నుంచి వచ్చిన పార్టీ ప్రెసిడెంట్ రామ్‌లాల్‌ని గెస్ట్‌హౌస్‌లోని అతని గదిలోనే కలిశాడు.

"ఢిల్లీ వచ్చి మిమ్మల్ని కలుద్దామని ఫోను చేస్తే మీరు ఇవాళ ఇక్కడికి వస్తున్నారని తెలిసింది. వెంటనే యిక్కడికి బయలుదేరాను."

"అవును, నా సెక్రెటరీ చెప్పాడు. మిగతా పార్టీవాళ్ళ ఎన్నికల సన్నాహాలు ఎలా వున్నాయి?"

"ఇప్పుడిప్పుడే వూపందుకుంటోంది. పోయినసారి ఎలక్షన్లలో మా కాన్‌స్టిట్యుయెన్సీలోని ఎన్నికల ఫలితాలివి" ఓ కాగితం అందించి చెప్పాడు.

దాన్ని చదివి టేబుల్ మీద పెట్టి చెప్పాడు.

"నిన్న నా సెక్రెటరీని అడిగి ఈ ఇన్ఫర్మేషన్ చూశాను."

"ఆ తర్వాత ఈ రెండేళ్ళు నేను చురుగ్గా పనిచేశాను అక్కడ. ఆ వివరాల పేపర్ కటింగ్స్ ఫైల్ యిది."

దాన్ని ఓసారి పైపైన తిరగేశాడు రామ్‌లాల్. ప్రతి కటింగ్‌లో పవన్ ఫోటో, అతను చేసే సహాయ, లేదా సేవా కార్యక్రమం తాలుకు వివరాలు వున్నాయి.

"మిగిలిన వాళ్ళలో ఎవరూ ఓటర్లతో ఇలా టచ్‌లో లేరు" పవన్ చెప్పాడు.

"గుడ్ దీన్ని నాతో తీసుకెళతాను."

"అలాగే సార్ నన్ను నిలబడవద్దంటూ కుమారస్వామి తన గూండాలతో కబురు చేశాడు."

"ఎప్పుడు?" ఆసక్తిగా అడిగాడాయన.

"నాలుగైదు రోజులైంది. దాన్ని కబురు అనేకంటే హెచ్చరిక అనడం సబబు."

"ఐసీ నువ్వు నిలబడకపోతే అతను గెలిచి తీరతాడనా?"

"అవును."

చిన్నగా తల పంకించాడాయన.

"సీట్స్ అలాట్ మెంటు ఇంకో వారం రోజుల్లో మొదలవుతుంది. ఈ విషయాన్ని గుర్తుంచుకుంటాను."

"యంగెస్ట్ ఎం.ఎల్.ఏగా, ఏక్టివ్ ఎం.ఎల్.ఏగా నాకు బాగా పేరు వచ్చింది. సార్ మీరు ఎప్పుడూ చెప్తూంటారు. ఎం.ఎల్.ఏలు తమ కాన్స్టిట్యుయెన్సీలో ప్రనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని, పదవులకోసం పోటీపడి రాజధానిలో వుండకూడదని. అదే ఆదర్శంగా తీసుకున్నాను."

రామ్‌లాల్ ఇగో ఆ మాటలతో తృప్తిపడింది. పవన్‌కి టిక్కెట్ ఇవ్వాలనుకున్నాడు కానీ రాజకీయ నాయకుడు కాబట్టి మాట యివ్వలేదు. ఎటు పోయి ఎటు వస్తుందో అని.

"అలాగే, ఆలోచిస్తాను."

"థాంక్యూ వెరీమచ్ సార్"

"చలపతి ఎలా వున్నాడు?"

"కులాసానే సార్. మొన్ననే కలిశాను."

రామ్‌లాల్ ఇగోని పూర్తిగా తృప్తి పరిచాడు పవన్. వంగి ఆయన పాదాలను తన చేతితో తాకి.

"అరె - ఎందుకు?"

"మీలాంటి సీనియర్ మోస్ట్ పొలిటీషియన్ అంటే నాకెంతో గౌరవం సార్. మీ కెరీర్ నుంచి ఎంతో నేర్చుకున్నాను."

చిన్నగా నవ్వాడాయన.

"అక్కడ మళ్ళీ నీకు టిక్కెట్ వచ్చే ప్రయత్నం చేస్తాను."

"థాంక్యూ సార్. దయచేసి నన్ను గుర్తుంచుకోండి."

ఆ గదిలోనుంచి బయటికి వచ్చాక తనకు టిక్కెట్ ఖాయం అనుకున్నాడు పవన్.

ఎన్నికలకీ వాల్‌పోస్టర్లకీ సంబంధించిన డిజైన్ లే అవుట్స్‌ని గీయించడానికి ఆర్టిస్ట్ ఇంటికి బయలుదేరాడు కుమారస్వామి బావమరిది రామ్‌గోపాల్.

ముందే కాపున్న ఇద్దరు అతని స్కూటర్ని ఆటకాయించి ఆపారు. కొడవళ్ళతో, కత్తులతో అతనిమీద దాడి చేశారు.

అతని వెనుక స్కూటరు మీద కూర్చుని ఉన్న కుమారస్వామి పార్టీ కార్యకర్త స్వల్ప గాయాలతో తప్పించుకుని ఎదురుగా వున్న ఓ షాపులోకి పారిపోయాడు. ఆ బార్బర్‌షాపు షట్టర్ని దింపి తన ప్రాణాలను కాపాడుకున్నాడు.

తమ పని పూర్తికానిచ్చి ఆ ఇద్దరు గూండాలు ఆటోలో పారిపోయారు "పవన్ జిందాబాద్" అన్న నినాదాలు చేసుకుంటూ.

గాయపడి స్పృహలో లేని రామ్‌గోపాల్‌ని పోలీసులు ఉస్మానియా హాస్పిటల్లో చేర్చారు. సంగతి తెలియగానే హుటాహుటిగా కుమారస్వామి హాస్పిటల్‌కి చేరుకున్నాడు. ఆ గూండాలు చేసిన నినాదాలు గురించి అతనికి అక్కడ తెలిసింది.

"వెంటనే పవన్‌ని అరెస్ట్ చేయండి" డిసిపికి ఫోను చేసి చెప్పాడు కుమారస్వామి.

"పవన్ ఊళ్ళో లేడు. ఉదయం బొంబాయి వెళ్ళాడు."

"చూశారా? అయితే ఖచ్చితంగా ఇది పవన్ చేయించిన పనే. హత్యా సమయంలో ఊళ్ళో ఉండకుండా పోవడం మా తాతల కాలంనుంచి వస్తున్న సాంప్రదాయం."

"ఆ గూండాల నినాదాలు తప్ప వేరే సాక్ష్యాధారాలేం లేవు ముందర వాళ్ళని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాం."

"నా బావమరిది మరణిస్తే మాత్రం పవన్ జీవించి వుండడు" కోపంగా అరిచాడు కుమారస్వామి.

"దటీజ్ అబ్వియస్" ఫోను పెట్టేశాడు డిసిపి అవతలివైపు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in